

గురువారం ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 35.5°C | కనిష్ఠం : 21.5°C



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : శుక్రవారం సా : 6.31 గం..
సహర్ : శనివారం ఉ : 5.02 గం..



తీస్‌మార్

మానుకోట పార్లమెంట్ బరిలో పాత ముఖాలే..

- ముగ్గురూ ముగ్గురే.. గెలుపుపై ఎవరి ధీమా వారిదే
- త్రిముఖ పోటీతో రసవత్తరంగా రాజకీయం

మహబూబాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే సమయం సమీపిస్తోంది. ఇప్పటికే మహబూబాబాద్ ఎంపీ స్థానం నుంచి బరిలో నిలిచే అభ్యర్థులెవరో తేలిపోయింది. ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ తమ అభ్యర్థులను ప్రకటించాయి. తొలుత గులాబీ బాస్ కేసీఆర్ సిట్టింగ్ ఎంపీ మాలోతు కవితకే టికెట్ కేటాయించగా.. ఆ తర్వాత 'హస్తం' పార్టీ తమ అభ్యర్థిగా కేంద్ర మాజీమంత్రి, పోరిక బలరాంనాయక్ పేరును ప్రకటించింది. తాజాగా బుధవారం రాత్రి బీజేపీ అధిష్ఠానం మాజీ ఎంపీ, ప్రొఫెసర్ అజ్మీర సీతారాంనాయక్‌ను మానుకోట బరిలో నిలుపుతున్నట్లు వెల్లడించింది. అయితే ఈ ముగ్గురు మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు పాతముఖాలే కాగా.. గెలుపు తమదేనంటూ ఎవరికి వారు ధీమాగా ఉన్నారు. దేశవ్యాప్తంగా పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజన సమయంలో 2009లో మహబూబాబాద్ ఎస్టీ రిజర్వుడ్‌గా ఆవిర్భవించింది. ములుగు, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లెందు, పినపాక, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాల ఏజెన్సీ బెల్టుతో మహబూబాబాద్ ఎంపీ నియోజకవర్గం రూపుదిద్దుకుంది. ఇందులో ఎంపీ సెగ్మెంట్‌తో పాటు ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లలో నర్సంపేట మినహా మిగిలిన ఆరు ఎస్టీకే రిజర్వుడ్ అయ్యాయి. తొలి పార్లమెంటరీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నుంచి పోరిక బలరాంనాయక్, మహాకూటమి సీపీఐ నుంచి కుంజా శ్రీనివాసరావు, చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ నుంచి రిటైర్డ్ ఐపీఎస్ అధికారి డీటీ నాయక్ త్రిముఖంగా పోటీపడ్డారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో నాలుగోసారి మహబూబాబాద్‌కు తొలి ఎన్నికల తరహా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల మధ్య ప్రధాన త్రిముఖ పోటీ అనివార్యమని పరిశీలకులు భావిస్తున్నారు.

గత ఎన్నికల్లో ఫలితాలిలా..

2009లో తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన పోరిక బలరాంనాయక్‌కు 3,94,447 ఓట్లు రాగా, ఆయన సమీప ప్రత్యర్థి సీపీఐ కుంజా శ్రీనివాసరావుకు 3,25,490 ఓట్లు లభించాయి. త్రిముఖ పోటీలో ఓటమి పాలైన పీఆర్పీ అభ్యర్థి డీటీ నాయక్‌కు 1,45,299 ఓట్లు లభించాయి. విజేత బలరాంకు 68,957 ఓట్ల మెజార్టీ లభించింది. ఆ తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లోనూ ఇదే రీతిన బీఆర్ఎస్, కాంగ్రెస్, టీడీపీల మధ్య త్రిముఖ పోరు నడిచింది. బీఆర్ఎస్ నుంచి గెలిచిన ప్రొఫెసర్ అజ్మీర సీతారాంనాయక్‌కు 3,20,569 ఓట్లు రాగా, ఆయన సమీప కాంగ్రెస్ ప్రత్యర్థి పోరిక బలరాంనాయక్‌కు 2,85,577 ఓట్లు లభించాయి. ఈ త్రిముఖ పోటీలో ఓడిన టీడీపీ అభ్యర్థి బానోత్ మోహన్‌లాల్‌కు 2,15,904 ఓట్లు లభించాయి. విజేత అజ్మీర సీతారాంనాయక్ 34,992 ఓట్ల మెజార్టీ లభించింది. 2019 ఎన్నికల్లోనూ బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల మధ్య త్రిముఖ పోటీ ఉంటుందని అంచనా వేశారు. కానీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ హోరాహోరీగా తలపడ్డాయి. బీఆర్ఎస్ నుంచి గెలిచిన మాలోతు కవితకు 4,62,109 ఓట్లు రాగా, సమీప కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌కు 3,15,446 ఓట్లు లభించాయి. బీజేపీ అభ్యర్థి జాటోతు హుస్సేన్‌నాయక్‌కు కేవలం 25,487 ఓట్లు వచ్చాయి. విజేత మాలోతు కవితకు 1,46,663 ఓట్ల మెజార్టీ లభించింది.

అనూహ్యంగా హేమాహేమీలు

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మూడు ప్రధాన రాజకీయ పార్టీలు అనూహ్యంగా హేమాహేమిలను బరిలో నిలుపుతున్నాయి. మహబూబాబాద్ ఎస్టీ రిజర్వుడ్ పార్లమెంట్ ఆవిర్భావ ఎన్నికల్లో కాంగ్రెస్ తరుపున విజేతగా నిలిచి కేంద్ర క్యాబినెట్‌లో ప్రాతినిధ్యం పొందిన పోరిక బలరాంనాయక్‌ను కాంగ్రెస్ పార్టీ ఆచితూచి ఎంపిక చేసి పార్టీ టికెట్ కేటాయించింది. బీఆర్ఎస్ గత అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం పాలైనప్పటికి మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా తిరిగి సిట్టింగ్ ఎంపీ మాలోతు కవితనే బరిలో నిలుపుతోంది. ఈ టికెట్ ఆశించి భంగపడ్డ మాజీ బీఆర్ఎస్ ఎంపీ, ప్రొఫెసర్ అజ్మీర సీతారాంనాయక్ చివరి నిమిషంలో బీజేపీలో చేరి మహబూబాబాద్ టికెట్ సంపాదించుకుని తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఈ ముగ్గురిలో కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్, బీజేపీ అభ్యర్థి ప్రొఫెసర్ అజ్మీర సీతారాంనాయక్ ఇద్దరు ములుగు అసెంబ్లీ సెగ్మెంట్‌కు చెందినవారు కాగా, బీఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవిత మహబూబాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు చెందిన వారు. ఈ ముగ్గురు ఎవరికి వారే తాము ఇదే లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించి ఉండడంతో అన్ని అసెంబ్లీ సెగ్మెంట్‌లలో నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలతోనూ సత్సంబంధాలు కలిగి ఉండి, విజయాన్ని చేరుకోవాలని సర్వశక్తులు ఒడ్డనున్నారు.

ముగ్గురు అభ్యర్థుల ప్రొఫైల్.. 6లో..

నేటి నుంచి ఒక్కపూట బడులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 14 : జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుంచి అన్ని యాజమాన్య పాఠశాలలకు ఒంటిపూట బడులు నిర్వహించబడుతాయని డీఈవో రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నడుస్తాయని వివరించారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అందించి, ఇంటికి పంపించాలన్నారు. ఈనెల 18వ తేదీ నుంచి పదోతరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో టెన్త్ పరీక్ష కేంద్రాలున్న పాఠశాలల్లో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5 గంటలకు పాఠశాల నిర్వహణ ఉంటుందన్నారు. ఈ విద్యార్థులకు కూడా 12.30 గంటలకు మధ్యాహ్నభోజనం అందించాలని చెప్పారు.

ఎస్సెస్సీ వార్షిక పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- ఎగ్జామ్ సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు
- అదనపు కలెక్టర్ డేవిడ్



సమావేశంలో మాట్లాడుతున్న డేవిడ్

మహబూబాబాద్ టౌన్, మార్చి 14 : జిల్లాలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ డేవిడ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఎస్సెస్సీ వార్షిక ఎగ్జామ్స్ నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ నుంచి ఏప్రిల్ 2 వరకు జరిగే టెన్త్ పరీక్షలకు 49 సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. 4,239 మంది విద్యార్థులు, 3952 విద్యార్థినులు రాయనున్నారని చెప్పారు. ఎక్కడా కూడా మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సెల్ ఫోన్లను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించవద్దన్నారు. సెంటర్ల వద్దఉన్న జిరాక్స్ సెంటర్లను మూసి వేయించాలని, అక్కడ 114 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలన్నారు. పోలీస్ ఎస్కార్ట్‌తో వాహనంలో మాత్రమే కేంద్రాలకు పరీక్ష పేప ర్లను తరలించాలని అధికారులను ఆదేశించారు. ప్రతీ సెంటర్‌కు ఇద్దరు ఏఎస్ఐలు, ఒక సబ్ సెంట్రీతో బందోబస్తు నిర్వహించాలన్నారు. కాంపౌండ్ వాల్‌లేని పరీక్ష కేంద్రాలకు బారికేడ్లను ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో ఏఎన్ఎం, ఇద్దరు ఆశవర్కర్లను నియమించాలన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా పరీక్ష సమయానికి బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల సందేహాల నివృత్తికి సెల్:98497 61012, 94905 56656 కంట్రోల్‌రూంనెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో డీఈవో రామారావు పాల్గొన్నారు.

డీఎంఅండ్‌హెచ్‌వోగా కళావతిబాయి

- బాధ్యతల స్వీకరణ



జిల్లా వైద్యాధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న కళావతిబాయి

నెహ్రూసెంటర్, మార్చి 14 : జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంఅండ్‌హెచ్‌వో)గా బి.కళావతిబాయి గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జ్ డీఎంఅండ్‌హెచ్‌వోగా పని చేసిన ఎ.అంబరీషను డీసీఎస్వోగా రెగ్యూలర్ స్థానానికి వెళ్లారు. ఆయన స్థానంలో సూర్యాపేట జిల్లా జనరల్ ఆస్పత్రి సీఎస్ఆర్ఎంవోగా పని చేస్తున్న బి.కళావతి బాయికి మహబూబాబాద్ పూర్తిస్థాయి డీఎంఅండ్‌హెచ్‌వోగా బాధ్యతలు ఇస్తూ తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ హెల్త్‌అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ బి.రవీందర్‌నాయక్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆమె డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, ఆమె బోకే అందించారు.

మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌రావు అంత్యక్రియలు పూర్తి

- కడసారి చూపునకు భారీగా తరలొచ్చిన అభిమానులు
- నివాళులర్పించిన ప్రభుత్వవిప్, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు



వివరాలు 6లో..

సుధాకర్‌రావు భౌతికకాయం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

సర్కార్ స్కూళ్లల్లో అమ్మ ఆదర్శ కమిటీలు

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



వీసీలో పాల్గొన్న మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, మార్చి14(ఆంధ్రజ్యోతి) : అన్ని ప్రభుత్వపాఠశాలల్లో 'అమ్మ ఆదర్శ కమిటీ'లను జూన్ 10 లోగా పూర్తి చేయాలని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి కలెక్టర్‌తో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల్లో మహిళా సంఘం నాయకురాలు అధ్యక్షురాలుగా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కన్వీనర్‌గా ఉంటారని వివరించారు. కమిటీ అధ్యక్షులు, కన్వీనర్ కలిసి పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లులను సభ్యులుగా ఎంపిక చేస్తారని చెప్పారు. వీరు రెండేళ్లపాటు పాఠశాల నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో పని చేస్తారని తెలిపారు. నిర్వహణ కమిటీకి ప్రత్యేక బ్యాంక్ అకౌంట్‌ను తీయాలని సూచించారు. పాఠశాలలో చదివే విద్యార్థుల స్కూల్ యూనిఫాంను కుట్టే బాధ్యతను సైతం స్వశక్తి మహిళ సంఘాలకు కేటాయించామని అన్నారు. జిల్లాలో ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా స్కూల్ యూనిఫాంను కుట్టే సామర్థ్యం గల మహిళ సంఘాలను గుర్తించి, వారికి వెంటనే ఆర్డర్ చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో తాగునీటి సౌకర్యం, తరగతి గదుల మరమ్మతులు, నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను ఉపయోగంలోకి తీసుకు రావడం, బాలికల కోసం అదనంగా మరుగుదొడ్ల నిర్మాణం, తరగతి గదికి విద్యుత్ సౌకర్యం లాంటి మౌళిక వసతులు అమ్మ పాఠశాలల కమిటీల ద్వారా జూన్ 10 కల్పించాలని సూచించారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల వద్ద రూ.25 వేల వరకు ఎమర్జెన్సీ ద్వారా నిధులు ఉపయోగించుకోవచ్చని శాంతికుమారి వివరించారు. మిగిలిన పనులు జిల్లా సమాఖ్యకు కేటాయించాల్సి ఉంటుందని తెలిపారు. డీఎంఎఫ్‌టీ ప్రత్యేక అభివృద్ధి నిధులు నేరుగా వినియోగించుకుని పాఠశాలల్లో మౌళిక వసతులు చేపట్టాలని చెప్పారు. పాఠశాలల్లో చేపట్టిన పనులకు రూ.లక్ష వరకు ఎంపీడీవో పరిశీలించి బిల్లులు చెస్తారని, రూ.లక్షకు పైగా పనులకు ఎంబీలు పరిశీలించి కలెక్టర్ చెల్లింపులు చేస్తారని, అవసరమై నిధులు కలెక్టర్ వద్ద అందుబాటులో ఉంచుతామని చెప్పారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌తో పాటు అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్‌టొప్పొ, ఎం.డేవిడ్, జడ్పీ సీఈవో రమాదేవి, డీఈవో రామారావు, డీఆర్‌డీఏ పీడీ పురుషోత్తం, ముఖ్య ప్రణాళిక అధికారి సుబ్బారావు పాల్గొన్నారు.

అనుమతులు సకాలంలో మంజూరు చేయాలి..

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమలకు పరిపాలన అనుమతులు సకాంలో మంజూరు చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పరిశ్రమల శాఖపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో టీఎస్ఐపాస్ ద్వారా ఐదు దరఖాస్తులు రాగా వాటిని పరిశీలించి, సంబంధిత శాఖలవారీగా పరిపాలన అనుమతులు మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. టీప్రైడ్ పథకం ద్వారా దరఖాస్తు చేసుకున్న 21 మంది ఎస్టీ, నలుగురు ఎస్సీ మొత్తం 25 మంది లబ్ధిదారులకు రూ.70,33,948 సబ్సిడీని మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారంజిల్లాలో పరిశ్రమల దరఖాస్తు చేసుకున్న వాటిని టీఎస్ ఐపాస్, టీప్రైడ్ పథకం లబ్ధిదారులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు అనుమతులు మంజూరు చేశామని వివరించారు. పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ సత్యనారాయణ, విద్యుత్‌శాఖ ఎస్ఈ నరేష్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, ఆర్టీవో మనోహర్ పాల్గొన్నారు.

పసుపు సాగులో ఆధునిక పద్ధతులు అవలంబించాలి

- జిల్లా ఉద్యాన శాఖాధికారి మరియన్న

కేసముద్రం, మార్చి14 : పసుపు సాగులో రైతులు ఆధునిక పద్ధతులు అవలంబించడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని జిల్లా ఉద్యాన శాఖాధికారి మరియన్న సూచించారు. కేసముద్రం రైతువేదికలో గురువారం నిజామాబాద్ పసుపు పరిశోధన కేంద్రం, హెచ్ఆర్ఎస్ మల్యాల సహకారంతో 'పసుపు సాగు ఆధునిక పద్ధతులు విలువ జోడింపు' అంశంపై రైతులకు అవగాహన నిర్వహించా రు. ఈ సందర్భంగా పలువురు శాస్త్రవేత్తలు నూతన యాజమాన్య పద్ధతులపై వివరించారు. పసుపు పరిశోధన కేంద్రంప్రధాన శాస్త్రవేత్త మహేందర్, శాస్త్రవేత్తలు శ్రీనివాస్, భాస్కర్, ఎఫ్‌పీవో చైర్మన్ జైపాల్‌రెడ్డి, గండి శ్రీనివాస్, దామోదర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఆకుల సుధాకర్, మెట్టు రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్, కుమారస్వామి, లక్కాకుల సత్యనారాయణ, తోట నాగయ్య, రాజశేఖర్, సంతోష్ పాల్గొన్నారు.

నేడు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో ప్రవేశాలకు డ్రా

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి14 : హైదరాబాద్ బేగంపేట పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశాలకు కోసం అదనపు కలెక్టర్ చాంబర్‌లో శుక్రవారం (నేడు) డ్రా నిర్వహిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి బాలరాజు గురువారం ఇక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరంలో ఒకటో తరగతి (నాన్ రెసిడెన్షియల్)లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న ఎస్సీ విద్యార్థులను డ్రాపద్ధతిలో ఎంపిక చేస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు మధ్యాహ్నం 3 గంటల వరకు చాంబర్‌కు హాజరుకావాలని ఆయన కోరారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

- జిల్లాలో 3,765 మంది విద్యార్థుల హాజరు



మానుకోటలో పరీక్ష రాసి బయటకు వస్తున్న ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 14 : గత నెల 29వ తేదీన ప్రారంభమైన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర రెగ్యూలర్ విద్యార్థుల వార్షిక పరీక్షలు గురువారంతో ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా 19 సెంటర్లలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు నిర్వహించిన ద్వితీయ సంవత్సర జనరల్, వొకేషనల్ పరీక్షలకు 3938మంది హాజరు కానుండగా 3,765 హాజరైనట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి సమ్మెట సత్య నారాయణ తెలిపారు. జనరల్ విభాగంలో 3,174 మంది హాజరు కానుండగా 3,073 (96.82 శాతం)మంది పరీక్ష రాశారు. వొకేషనల్ విభాగంలో 764 మంది హాజరు కానుండగా 692 (90.58శాతం)మంది హాజరయ్యారన్నారు. పరీక్షల్లో ఎలాంటి మాస్ కాపీయింగ్, డిబార్‌లు కానీ లేకుండా ప్రశాంతంగా జరిగాయని తెలిపారు.

కళకు గుర్తింపు..



రవీంద్రభారతిలో మంత్రి సీతక్కనుంచి అవార్డును స్వీకరిస్తున్న నృత్యకళాకారిణి దయ్యాల భాగ్య

మహబూబాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ రవీంద్రభారతిలో గురువారం జరిగిన మహిళా దినోత్సవ వేడుకల సందర్భంగా పలు రంగాల్లో విశిష్టసేవలు, స్వచ్ఛంద సేవాకార్యక్రమాలు, కళారంగాల్లో ప్రత్యేకతను నిలుపుకొన్న రాష్ట్రంలోని పలువురు మహిళలకు మంత్రి సీతక్క ఆధ్వర్యంలో అవార్డులు అందజేశారు. వారికి ప్రభుత్వం తరపున జ్ఞాపికతో పాటు రూ.లక్ష విలువచేసే చెక్కును అందజేశారు. ఈ అవార్డులు అందుకున్న వారిలో మహబూబాబాద్ జిల్లా గూడూరుకు చెందిన నృత్యకళాకారిణి దయ్యాల భాగ్య ఉన్నారు. వారికి మంత్రి సీతక్క, తదితరులు అవార్డులు అందజేసి, సత్కరించారు.

నేరస్థులకు శిక్షపడే విధంగా చర్యలు తీసుకోవాలి

- నేరాల ఛేదనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి
- ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్



సమావేశంలో మాట్లాడుతున్న సుధీర్‌రామ్‌నాథ్

మహబూబాబాద్ రూరల్, మార్చి14 : నేర ఛేదనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని, నేరస్తులకు శిక్షపడే విధంగా కన్విక్షన్ రేట్ పెంచాలని, నేర నిరూపణకు సాక్ష్యాధారాలను పకడ్బందీగా సేకరించి, వారికి శిక్ష పడేలా పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ ఆదేశించారు. మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం పోలీస్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానంపై ఫోరెన్సిక్ సైన్స్‌పై శాస్త్రీయ ఆధారాలపై కేసు సమగ్రంగా పూర్తిపట్టు సాధించిన తర్వాతనే నేర పరిశోధన చేయాలని సూచించారు. ఇన్వెస్టిగేషన్‌లో ఆలసత్వం ప్రదర్శించకుండా పారదర్శకంగా విచారణ చేసి, నిందితులకు శిక్ష పడేలా సమయానుకూలంగా విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల సమయంలో నమోదైన కేసులను పూర్తి చేయాలన్నారు. రాబోయే ఎన్నికల సందర్భంగా పోలీసులందరూ ఎన్నికల సంఘం నియంత్రణలో పర్యవేక్షణ, క్రమశిక్షణకు లోబడి పని చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎటువంటి పొరపాట్లు జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పీడీఎస్ బియ్యం, మద్యం, గంజాయి లాంటి వాటిని సరఫరా చేసేవారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. గంజాయి అక్రమ రవాణాపై నిఘా పెంచాలని ఆదేశించారు. సమస్యలు సృష్టించిన వారిపై పూర్తి నిఘాపెట్టి, రౌడీషీటర్లను బైండోవర్ చేయాలని సూచించారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాల తనిఖీ నిర్వహించి, రాత్రి సమయాల్లో పెట్రోలింగ్‌ను పెంచాలనిఆదేశించారు. పాత నేరస్తుల ఇండ్లపై నిఘా పెంచాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ జోగుల చెన్నయ్య, ట్రైనీ ఐపీఎస్ పండరీచేతన్, డీఎస్పీలు సురేష్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు దరఖాస్తులు

కేయూ క్యాంపస్, మార్చి 14: జిల్లా షెడ్యూల్ కులాల అధ్యయన, అభివృద్ధి సంస్థల నేతృత్వంలో రెండు నెలల పాటు 100 మంది నిరుద్యోగ యువతకు ఉచిత వసతితో కూడిన శిక్షణ ఇచ్చేందుకుగాను ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఎస్సీ స్టడీ సర్కిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా గౌరవ సంచాలకుడు డాక్టర్ కె.జగన్‌మోహన్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఏప్రిల్ 3 నుంచి జూన్ 2 వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు బీఎడ్, డైట్, టెట్ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు http://tsstudycircle.-co.in/ వెబ్‌సైట్‌లో మార్చి 24 వరకు దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

బీసీ విద్యార్థులకు ఉచిత శిక్షణ

హనుమకొండ కలెక్టరేట్, మార్చి 14: హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ద్వారా హైదరాబాద్‌లో బీసీ విద్యార్థులకు బ్యాంకింగ్, ఫైనాన్స్‌లో రెండు నెలలు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎంపీపీ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామ, ములుగు జిల్లాలకు చెందిన అర్హులైన నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 0870-2571192, 040-29303130 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

అంగన్‌వాడీ మండల కమిటీ ఎన్నిక

కాజీపేట, మార్చి 14 : తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ కాజీపేట మండల నూతన కమిటీ గురువారం ఎన్నిక జరిగింది. అధ్యక్షురాలుగా కె.రమాదేవి, కార్యదర్శిగా ఎం.కవిత, కోశాధికారిగా పి.శారద, ఉపాధ్యక్షురాలుగా ఎం.అరుణ, టి.శ్రీదేవి, సహాయ కార్యదర్శిగా డి.లలిత ఎన్నికయ్యారు. అంతకు ముందు సో మిడి సెక్టార్ లీడర్లుగా ఎం.కవిత, డి.బాలశ్రీ, పి.రఘుకుమారి, మడికొండ సెక్టార్‌కు పి.వెంకటలక్ష్మి, పి.శారద, కె.రాజ్యలక్ష్మి, దర్గా సెక్టార్‌కు టి.జ్ఞానసుందరి, ఎం. అరుణ, కె.రజనీలను ఎన్నుకున్నారు.



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

16న నిరుద్యోగ యువతకు జాబ్ మేళా

వరంగల్ క్రైం, మార్చి 14: వరంగల్ కమిషనరేట్ పోలీసుల ఆధ్వర్యంలో ఈ నెల 16న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝూ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టీయంఐ ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న జాబ్‌మేళాను కమిషనరేట్ పరిధిలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సీపీ సూచించారు. హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే జాబ్ మేళాలో 3వేలకు పైగా ప్రముఖ కంపెనీలు ఉద్యోగ నియామకాలు చేపడతాయన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యే యువత.. కనీసం 10వతరగతి పూర్తి చేసి ఉండాలన్నారు. జాబ్ మేళాకు హాజరయ్యే యువత ముందస్తుగా సంబంధిత వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అంబర్ కిషోర్ ఝూ సూచించారు.

బీఆర్ఎస్, బీఎస్పీ పొత్తు.. రహస్యమేంటి?

- ఇమడలేకనే బీఆర్ఎస్ వీడుతున్నా: కోనేరు కోనప్ప
- మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



కాగజ్‌నగర్, మార్చి 14: బీఆర్ఎస్, బీఎస్పీతో పొత్తుపెట్టుకోవటం వెనుక రహస్య ఒప్పందం ఏంటని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనపై లేనిపోని ఆరోపణలు చేసి ఓడించిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో బీఆర్ఎస్ జత కట్టడం ఇమడలేకనే ఆ పార్టీని వీడుతున్నట్టు ప్రకటించారు. గురువారం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సమక్షంలో కోనప్ప కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతో పాటు జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, మునిసిపల్ చైర్‌పర్సన్ షహీన్ సుల్తానా, వైస్ చైర్మన్ రాజేందర్‌తోపాటు పలువురు ఎంపీపీలు, జెడ్పీటీసీలు కూడా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా కోనప్ప మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్‌పై తనకు ఎలాంటి కోపం లేదన్నారు. తనకు ఎలాంటి పదవులు వద్దని, కేవలం సిర్పూరు నియోజకవర్గ అభివృద్ధి చాలని వ్యాఖ్యానించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ.. సిర్పూరు నియోజవర్గ సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

బీఆర్ఎస్‌కు పెద్దిరెడ్డి రాజీనామా

హుజూరాబాద్, హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తరువాత కీలక నేతలు పార్టీని వీడుతున్నారు. తాజాగా కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. తన ఆత్మగౌరవం దెబ్బతినే విధంగా అధిష్ఠానం వ్యవహార శైలి ఉందని, అది నచ్చకనే పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని ఆయన తెలిపారు. ఈ మేరకు గురువారం రాజీనామా లేఖను మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పంపించారు. పార్టీ సంస్థాగత నిర్మాణం, రాజకీయాలపై సుదీర్ఘ అనుభవం కలిగిన తనకు పార్టీలో సముచిత గౌరవం లభించలేదని పెద్దిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తలు, అభిమానులతో మాట్లాడి భవిష్యత్తు కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తానన్నారు. కాగా ఆయన అధికార కాంగ్రెస్‌లో చేరతారని సమాచారం.

ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ముగ్గురు

మహబూబ్‌నగర్, మార్చి14: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారంతో ముగిసింది. ఉపసంహరణ గడువు ముగిసే సమయానికి ముగ్గురు అభ్యర్థులు మాత్రమే పోటీలో నిలిచారు. మొత్తం 16మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. పరిశీలనలో ముగ్గురి దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. 10 మంది అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. కాంగ్రెస్ నుంచి మన్నె జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ నుంచి నవీన్‌కుమార్ రెడ్డి, స్వతంత్ర అభ్యర్థి సుదర్శన్‌గౌడ్ బరిలో నిలిచారు. 28న ఎన్నిక జరగనుంది.

మంత్రి కోమటిరెడ్డిని కలిసిన జానారెడ్డి

- రఘువీర్‌రెడ్డి విజయానికి సహకరించాలని విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న రఘువీర్‌రెడ్డి విజయం కోసం సహకరించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మాజీ మంత్రి జానారెడ్డి కోరారు. గురువారం బంజారాహిల్స్‌లోని మంత్రి నివాసానికి వెళ్లిన జానారెడ్డి తన కుమారుడు రఘువీర్‌రెడ్డిని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. మూడు దశాబ్దాలుగా రాజకీయాల్లో తమ మధ్య ఉన్న అనుబంధాన్ని ఇరువురు నేతలు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. రఘువీర్‌కు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని, ఆయన్ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని మంత్రి కోమటిరెడ్డి హామీ ఇచ్చారు.

ఆటోడ్రైవర్ల సమస్యలపై నిర్లక్ష్యం వీడాలి: హరీశ్

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఆటో నడవడం లేదని మనస్తాపంతో నిజామాబాద్‌లో ఓ సోదరుడు తన భార్యతో సహా ప్రాణాలు తీసుకున్న హృదయ విదారక ఘటన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కదిలించకపోవడం బాధాకరమని గురువారం ఎక్స్(ట్విటర్) వేదికగా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాధగా మారిన వారి బిడ్డ భవిష్యత్‌కు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఆ కుటుంబానికి వెంటనే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. అలాగే ఆటోడ్రైవర్ల జీవనసమస్యకు పరిష్కారం చూపాలని, వారికి రూ.12వేల భృతి ఇవ్వాలని హరీష్‌రావు కోరారు. కాగా, డీఎస్సీ పరీక్షలకు ముందే టెట్ నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించడం సంతోషకరమని మరో ట్వీట్‌లో హరీశ్ పేర్కొన్నారు.

డీకే శివకుమార్‌ను కలిసిన మల్లారెడ్డి

తనయుడితో కలిసి బెంగళూరుకు.. కర్ణాటక డిప్యూటీ సీఎంతో భేటీ

పార్టీ మారుతున్నారనే ఊహాగానాలు.. వ్యాపార లావాదేవీలేనన్న మల్లారెడ్డి

హైదరాబాద్/మేడ్చల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి గురువారం బెంగళూరులోని ఒక హోటల్లో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కలిశారు. మల్లారెడ్డి తనయుడు భద్రారెడ్డి కూడా వెంట ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి పలువురు నేతలు కాంగ్రెస్‌లోకి చేరుతున్న నేపథ్యంలో మల్లారెడ్డి భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. శుక్రవారం ఢిల్లీలో కాంగ్రెస్ ముఖ్యనేత ప్రియాంకగాంధీని కలిసేందుకు అవకాశం ఇప్పించమని మల్లారెడ్డి కుటుంబసభ్యులు డీకేను కోరినట్లు సమాచారం. గత వారమే మల్లారెడ్డి, అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డితో కలిసి సీఎం సలహాదారు అయిన వేంనరేందర్‌రెడ్డితో భేటీ అయ్యారు. అప్పుడే ఇద్దరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని ప్రచారం జరిగింది. దాంతో కేటీఆర్ మల్లారెడ్డిని తన నివాసానికి పిలిపించుకుని మాట్లాడారు. తనకు కాంగ్రెస్‌లోకి వెళ్లే ఆలోచన లేదని మల్లారెడ్డి కేటీఆర్‌కు చెప్పారు. ఆ మాట చెప్పి వారం గడవక ముందే డీకే శివకుమార్‌తో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీ మారుతున్నట్లు వచ్చిన ఆరోపణలను మల్లారెడ్డి ఖండించారు. తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానన్నారు. బెంగళూరుకు ఒక ఫంక్షన్‌కు వచ్చానని, అక్కడ ఒక ప్రైవేటు వర్సిటీ అమ్మకానికి ఉందని ఫ్రెండ్ చెబితే దాని కొనుగోలు గురించి మాట్లాడటానికి మధ్యవర్తి ద్వారా డీకే శివకుమార్‌ను కలిశానని తెలిపారు. , రాజకీయాలేవీ మాట్లాడలేదన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి 75 ఏళ్లు దాటుతాయని, ఆ ఎన్నికల్లో పోటీచేసే ఉద్దేశం తనకు లేదని స్పష్టం చేశారు. ఈ ఐదేళ్లు బీఆర్ఎస్‌లోనే ఉంటూ ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేస్తానని చెప్పారు. మల్లారెడ్డి డీకే శివకుమార్ దగ్గరే ఆగిపోకుండా ప్రియాంకగాంధీ అపాయింట్‌మెంట్ అడగడం ఊహాగానాలకు తావిస్తోంది. ఆస్తులను కాపాడుకోవడానికి కాంగ్రెస్‌లోకి వెళ్లడమే మార్గమని మల్లారెడ్డి భావిస్తున్నారని కాంగ్రెస్‌లోని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. మల్లారెడ్డి రాకను మేడ్చల్ కాంగ్రెస్ నేతలు మైనంపల్లి హన్మంతరావు, సుధీర్ రెడ్డి, వజ్రేష్‌యాదవ్, హరివర్ధన్‌రెడ్డి, నక్క ప్రభాకర్ గౌడ్ వ్యతిరేకిస్తున్నారు. రేవంత్ సన్నిహితుడిని కలిసినా చేరిక పని కాకపోవడంతో మల్లారెడ్డి బెంగుళూరు వైపు నుంచి నరుక్కొస్తున్నారని భావిస్తున్నారు.

ఆపరేషన్ రేవంత్!

(మొదటిపేజీ తరువాయి)

తెలుస్తోంది. రేవంత్ ఆయన సహచర బృందం కదలికలను గుర్తించడంతో పాటు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు డబ్బులు ఎక్కడినుంచి, ఏయే మార్గాల్లో, ఎవరెవరు సర్దుబాటు చేస్తున్నారు..? అనే వివరాలను ప్రణీత్ ట్యాపింగ్ చేశారు. ముఖ్యంగా ఎన్నికలకు కొద్ది నెలల ముందు నుంచి రేవంత్‌తో పాటు ఆయనకు అత్యంత సన్నిహితులు, సహకరించే అందరి ఫోన్‌లపైనా ట్యాపింగ్ కొనసాగినట్లు ఆధారాలు లభించినట్లు తెలిసింది. అప్పటి అధికార పార్టీ బీఆర్ఎస్ ఆదేశాల మేరకు నడుచుకున్న ప్రణీత్.. రాజకీయ నాయకులు, పోలీసులతో పాటు ప్రైవేటు వ్యక్తుల సహకారం కూడా తీసుకున్నారు. ఎక్కడికక్కడ తమకు అందుతున్న సమాచారం, ఫోన్ నంబర్ల ఆధారంగా ఎస్ఐబీ ప్రధాన కార్యాలయం, ఇతర వార్ రూంల నుంచి రోజుల వ్యవధిలోనే వందల ఫోన్‌ల ట్యాపింగ్‌కు పాల్పడ్డారు. హార్డ్ డిస్క్‌ల ధ్వంసం, కీలక పత్రాల దహనం కేసు దర్యాప్తులో భాగంగా ప్రణీత్ ఫోన్‌లోని వాట్సాప్ చాటింగ్‌లను దర్యాప్తు అధికారులు పరిశీలించగా బీఆర్ఎస్ నేతలతో పాటు ప్రైవేటు వ్యక్తుల నుంచి వచ్చిన సందేశాలను పరిశీలించారు. ఎన్నికల్లో డబ్బులు ఎవరెవరి చేతులు మారుతున్నాయన్న సమాచారం గుర్తించి కట్టడి చేశారని స్పష్టమైంది. అరెస్టు సమయంలో ప్రణీత్‌రావును ప్రాథమికంగా విచారించగా ఒక ఎస్పీ, ఎస్ఐబీ అప్పటి చీఫ్ ఆదేశాల మేరకే తాను, తన బృందం పనిచేసినట్లు వెల్లడించినట్లు తెలిసింది. ప్రణీత్‌ను కస్టడీకి తీసుకుని విచారించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. ఏడు రోజుల కస్టడీ



ప్రణీత్‌రావు (ఫైల్)

కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కాగా, ప్రణీత్‌రావు కేసుకు సంబంధించి ఇప్పటివరకు జరిగిన దర్యాప్తుపై సీఎం రేవంత్ పోలీసు ఉన్నతాధికారుల నుంచి ఆరా తీసినట్లు సమాచారం. దీంతో వారు సమగ్ర నివేదిక అందించారని తెలిసింది. ప్రణీత్ వ్యవహారంలో వెలుగులోకి వచ్చిన వ్యక్తుల పేర్లు.. అనుసరించాల్సిన విధానాలపై సీఎంకు వివరించినట్లు సమాచారం. చట్ట వ్యతిరేకంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేసినట్లు తెలిసింది.

ఉన్నతాధికారుల చుట్టూ ఉచ్చు

ప్రణీత్‌తో అంటకాగి కుట్రలో భాగస్వాములైన ఎస్ఐబీ అప్పటి ఉన్నతాధికారులను నేడో రేపో విచారించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. పంజాగుట్ట పోలీసులు వారికి నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఎన్నికల ముందు పనిచేసినవారిపై దృష్టిపెట్టినట్లు సమాచారం. కొన్ని నియోజకవర్గాల్లో అధికారులు వారి ఇళ్లలోనే ప్రత్యేక గదుల్లో (వార్ రూమ్‌లు) ఏర్పాట్లు చేసి, ట్యాపింగ్‌కు పాల్పడినట్లు గుర్తించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీటిని సిద్ధం చేసిన ప్రణీత్‌కు పలువురు సహచరులూ సహకరించినట్లు తెలుస్తోంది. మూడు నియోజకవర్గాల్లో విజిలెన్స్‌లో పనిచేస్తున్న ఇద్దరు, ఎస్ఐబీ అధికారి ఇళ్లలో వార్ రూమ్‌లను ఏర్పాటు చేసి, ప్రముఖుల ఫోన్‌లను ట్యాప్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఎన్నికల సందర్భంగా ఓ పార్టీ నిధుల తరలింపులోనూ ప్రణీత్ కీలక పాత్ర పోషించారని అనుమానిస్తున్నారు. డబ్బు, బంగారం, వస్తువులను చేరవేసేందుకు సొంత, ఎస్ఐబీ, గ్రేహౌండ్స్ వాహనాలను వినియోగించారనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. ప్రణీత్ ఫోన్ నుంచి కీలక వివరాలు సేకరించే పనిలో సైబర్ నిపుణులు ఉన్నారు. ఆయన తొలగించిన డేటాను రిట్రీవ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది బయటకు వస్తే మరింతమంది అరెస్టయ్యే అవకాశముందని చెబుతున్నారు. ఇప్పటికే ఎస్ఐబీ లాగర్ రూమ్‌లో పనిచేసిన ఇన్‌స్పెక్టర్, ఎస్సైలను విచారించారు.

ట్యాపింగ్ చేయమన్నది ఎవరు?

ట్యాపింగ్‌కు ఎవరు ప్రోత్సహించారు? ఎలాంటి సమాచారం సేకరించారు? ఎవరి పాత్ర ఎంత? అనే ప్రశ్నలకు ప్రవీణ్ స్పష్టంగా సమాధానం ఇచ్చారని తెలుస్తోంది. ఈ మేరకు పంజాగుట్ట పోలీసులు స్టేట్‌మెంట్ రికార్డు చేసి, సాంకేతిక ఆధారాలను సేకరించారు. ప్రణీత్ ఫోన్ డేటా విశ్లేషించి, ఏయే నంబర్లతో ఎంతమందితో టచ్‌లో ఉన్నారో తెలుసుకున్నారు. ఎవరెవరి ఫోన్‌లు ఎంత కాలం ట్యాప్ చేశారు? తదితర అంశాలను దర్యాప్తు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వార్ రూమ్‌లకు ఈ డేటాను అందించినట్లు అంచనాకు వచ్చారు. డేటాను కాపీ చేసిన హార్డ్ డిస్క్‌లు ఎక్కడున్నాయో దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక బ్యారెక్.. పకడ్బందీ భద్రత

ప్రణీత్‌ను విచారించి ఆధారాలు, సమాచారం రాబట్టేందుకు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ గురువారం నాంపల్లి కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రణీత్ న్యాయవాదులకు జడ్జి సూచించారు. శుక్రవారం వాదనలు జరిగే అవకాశముంది. కాగా, పోలీసుల అదుపులో ఉన్న ఆయనను బుధవారం రాత్రి చంచల్‌గూడ జైలుకు రిమాండ్‌కు తరలించారు. ప్రణీత్‌ను భద్రతా కారణాల దృష్ట్యా ప్రత్యేక బ్యారెక్‌లో ఉంచారు. సీసీ కెమెరా నిఘాతో పాటు నిరంతరం జైలు సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. అటువైపుగా ఇతర ఖైదీలను అనుమతించడం లేదు. గురువారం ఉదయం ప్రణీత్ తరపు న్యాయవాది అనుదీప్, సోదరుడు వంశీ ములాఖాత్ అయ్యారు.

కాంగ్రెస్‌లోకి జితేందర్‌రెడ్డి!

(మొదటిపేజీ తరువాయి)

సీఎం రేవంత్‌రెడ్డి గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి జితేందర్ నివాసానికి వెళ్లి అరగంట పాటు సమావేశమయ్యారు. ఇది జితేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరబోతున్నారన్న ప్రచారానికి మరింత ఊతమిచ్చినట్లైంది. మరోవైపు ఈ పరిణామం మహబూబ్‌నగర్ జిల్లాలోనూ కలకలం రేపింది. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవలి వరకు ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరిలో కాంగ్రెస్ నుంచి జితేందర్‌రెడ్డి పోటీ చేస్తారని పెద్దఎత్తున చర్చ జరిగింది. ఇక గురువారం సాయంత్రం మహబూబ్‌నగర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం వెళ్లి కలిశారంటేనే పార్టీలోకి ఆహ్వానించడానికి కాదా? అని వ్యాఖ్యానించారు. జితేందర్‌రెడ్డి మనస్తత్వం తనకు తెలుసని, ఎంపీగా రాష్ట్ర సమస్యల పరిష్కారానికి కృషి చేశారని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి పనిచేస్తే బీజేపీ మోసం చేసిందని ఆరోపించారు.

ఎన్నికల్లో పోటీ చేయను..

తాను ఎన్నికల్లో పోటీ చేయడం లేదని జితేందర్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. రేవంత్‌తోనూ ఎన్నికల్లో పోటీపై చర్చించలేదని స్పష్టంచేశారు. నిత్యం ప్రజల్లో ఉండే తనకు బీజేపీ టికెట్ రాకపోవడంతో సీఎం బాధపడ్డారని చెప్పారు. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం చూసి రేవంత్‌రెడ్డి వచ్చినట్లు చెప్పారు. తన భవిష్యత్తును పార్టీ అధినాయకత్వమే చూసుకుంటుందని చెప్పారు. కాగా, జితేందర్‌రెడ్డికి ప్రధాని మోదీ, అమిత్‌షాతో సన్నిహిత సంబంధాలున్నాయి. అయితే, తనకు టికెట్ రాలేదని తెలిసి ఓదార్చేందుకే.. సొంత జిల్లా వాసి అయిన రేవంత్ వచ్చి కలిశారని చెప్పినా మహబూబ్‌నగర్ బీజేపీ, కాంగ్రెస్ వర్గాల్లో మాత్రం పార్టీ మార్పు ఊహాగానాలు పెద్దఎత్తున సాగాయి.

అరుణ ప్రెస్‌మీట్‌లో జితేందర్ కుమారుడు

మహబూబ్‌నగర్ బీజేపీ అభ్యర్థిగా డీకే అరుణ పేరును ప్రకటించాక జితేందర్‌రెడ్డి కుమారుడు మిథున్‌రెడ్డి ఆమె నివాసానికి వెళ్లి అభినందలు తెలిపారు. గురువారం జితేందర్‌రెడ్డి నివాసానికి సీఎం రేవంత్ వెళతారని ప్రచారం జరుగుతున్న సమయంలోనే పాలమూరులో అరుణ మీడియా సమావేశం నిర్వహించారు. ఇందులోనూ మిథున్‌రెడ్డి పాల్గొనడం గమనార్హం.

నేడు హైదరాబాద్‌కు ప్రధాని మోదీ

(మొదటిపేజీ తరువాయి)

పర్యటించనున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా రెండు రోజుల కిందట వచ్చి, సంస్థాగత బలోపేతంపై రాష్ట్ర పార్టీకి దిశానిర్దేశం చేశారు. బీజేపీ సోషల్ మీడియా వారియర్స్‌తో పాటు పార్టీ పోలింగ్ బూత్ అధ్యక్షులు, ఆ పైస్థాయి క్యాడర్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బీజేపీ ముఖ్య నేతలతో భేటీ అయి పోలింగ్ బూత్‌ల పటిష్ఠత ఆవశ్యకతను వివరించారు. ఈ క్రమంలో ప్రధాని మోదీ శుక్రవారం మరోసారి రాష్ట్ర పర్యటనకు రానున్నారు. ఆయన మూడు రోజుల పాటు పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయనున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు నగరంలో మోదీ రోడ్ షోను నిర్వహించినట్లుగానే ఈసారి కూడా బీజేపీ అదే విధంగా ప్లాన్ చేస్తోంది. మూడు పార్లమెంటు నియోజకవర్గాలకు కలిపి ఒక కేంద్రంలో ప్రధాని ఎన్నికల ప్రచారం కొనసాగించేలా రాష్ట్ర పార్టీ ప్రణాళిక రూపొందించింది. ఇందుకు అనుగుణంగా మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, హైదరాబాద్ సెగ్మెంట్లకు కలిపి శుక్రవారం సాయంత్రం 5 గంటలకు మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో జరిగే రోడ్ షోలో మోదీ పాల్గొంటారు. మీర్జాలగూడ నుంచి మల్కాజ్‌గిరి చౌరస్తా 1.3 కి.మీ మేర ఈ రోడ్ షోను భారీ ఎత్తున నిర్వహించేందుకు బీజేపీ ఏర్పాట్లు చేస్తోంది. శుక్రవారం సాయంత్రం 4.50 గంటలకు ప్రధాని ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. 5 గంటల నుంచి 6 గంటల వరకు రోడ్ షోలో పాల్గొంటారు. మల్కాజ్‌గిరి చౌరస్తాలో ప్రసంగిస్తారు. అనంతరం, ప్రధాని రాజ్‌భవన్‌కు వెళ్లి బస చేస్తారు. శనివారం ఉదయం 11 గంటలకు బయలుదేరి నాగర్‌కర్నూలులో నిర్వహించే బహిరంగ సభకు హాజరవుతారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గాలకు సంబంధించి ఈ సభను ఏర్పాటుచేశారు. అనంతరం గుల్బర్గా బయలుదేరి వెళతారు. తిరిగి 18న జగిత్యాలలో నిర్వహించే బహిరంగ సభలో ప్రధాని పాల్గొంటారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ సెగ్మెంట్లకు సంబంధించి ఈ సభను ఏర్పాటు చేసినట్లు బీజేపీ వర్గాలు వివరించాయి.

రేవంత్‌కు అభద్రతా భావమెందుకు?: లక్ష్మణ్

కాంగ్రెస్‌కు మెజారిటీ ఎమ్మెల్యేలు ఉన్నప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు అభద్రతా భావంతో మాట్లాడుతున్నారని ఎంపీ లక్ష్మణ్ ప్రశ్నించారు. ఎంపీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పాటుకు మార్గం సుగమమవుతుందని చెప్పారు. ఈ ప్రభుత్వం ఐదేళ్లు కొనసాగాలనే కోరుకుంటున్నామని.. కానీ నిలబెట్టుకోలేకపోతే వారి కర్మ అని అన్నారు. రాష్ట్రంలో 12కు పైగా స్థానాల్లో బీజేపీ విజయం ఖాయమని మాజీ ఎంపీ, చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఓటమికి, ఆ పార్టీ పతనానికి అహంకారమే కారణమని మాజీ ఎంపీ, బీజేపీ మహబూబాబాద్ లోక్‌సభ అభ్యర్థి సీతారాం ఢిల్లీలో విమర్శించారు. ప్రజలే ఆ అహంకారాన్ని అణచివేశారని తెలిపారు.

పలు ప్రాజెక్టులకు అనుమతులు

హైదరాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల నిర్మాణాలకు పరిపాలనపర అనుమతులు ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఖమ్మం జిల్లాలో మున్నేరు వాగుపై రూ.107.30 కోట్లతో ఆనకట్ట, నాగార్జున సాగర్ ఎడమకాలువపై రూ.35.75 కోట్లతో కొడుమూరు ఎత్తిపోతల పథకం రెండో దశ, కరీంనగర్ జిల్లాలోని కలువల వాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణానికి అనుమతి ఇచ్చింది.

తెలంగాణలో కాంగ్రెస్‌దే హవా!

17 లోక్‌సభ స్థానాల్లో 10 ఆ పార్టీ ఖాతాలోకే.. బీజేపీ-4, బీఆర్ఎస్-2, మజ్లిస్-1

- ఏపీలో టీడీపీ కూటమికి ఘన విజయం
- 25 సీట్లలో 20 గెల్చుకునే అవకాశం
- ఉత్తరాదిన మళ్లీ బీజేపీ ప్రభంజనం
- పలు రాష్ట్రాల్లో కమలం క్లీన్ స్వీప్!
- ఏబీపీ-సీఓటర్ సర్వే అంచనాలు
- తెలంగాణలో బీజేపీ 8 సీట్లు

గెలుస్తుందని నెట్‌వర్క్ 18 సర్వే వెల్లడి



న్యూఢిల్లీ, మార్చి 14: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ 10 స్థానాలను కైవసం చేసుకోనుందని ఏబీపీ- సీ ఓటర్ ఒపీనియన్ పోల్ అంచనా వేసింది. మొత్తం 17 స్థానాల్లో బీజేపీ 4, బీఆర్ఎస్ 2, ఎంఐఎం 1 స్థానం గెలవవచ్చని పేర్కొంది. కాగా, ఓట్ల విషయానికొస్తే.. కాంగ్రెస్ 43 శాతం, బీఆర్ఎస్ 28 శాతం, బీజేపీ 25 శాతం, ఎంఐఎం ఒక శాతం ఓట్లను దక్కించుకోవచ్చని ఈ సర్వే తెలిపింది. ఏపీలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి, వైసీపీ, కాంగ్రెస్‌ల మధ్య త్రిముఖ పోరు ఉంటుందని ఈ సర్వే వెల్లడించింది. మొత్తం 25 సీట్లలో టీడీపీ కూటమి 20 సీట్లను తమ ఖాతాలో వేసుకుంటుందని, వైసీపీ కేవలం 5 స్థానాలకే పరిమితమవుతుందని పేర్కొంది. ఓట్ల పరంగా కూటమికి 45 శాతం, వైసీపీకి 42 శాతం, కాంగ్రెస్‌కు 3 శాతం ఓట్లు లభిస్తాయని తెలియజేసింది. ఇతర రాష్ట్రాల విషయానికొస్తే ఈ సర్వే వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.


తమిళనాడులో డీఎంకే-కాంగ్రెస్ స్వీప్

కర్ణాటకలో బీజేపీ-జేడీఎస్ కూటమి 23 సీట్లను, కాంగ్రెస్ ఐదు సీట్లను దక్కించుకుంటాయి. తమిళనాడులో మొత్తం 39 సీట్లనూ డీఎంకే-కాంగ్రెస్ కూటమి స్వీప్ చేయనుంది. కేరళలో ఉన్న 20 సీట్లలో 16 సీట్లు కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ గెల్చుకోనుంది. మిగిలిన నాలుగు సీట్లు వామపక్ష (ఎల్‌డీఎఫ్) కూటమి కైవసం చేసుకుంటుంది. బీజేపీకి ఒక్క స్థానం కూడా దక్కే అవకాశం లేదు. ఇక దేశంలోనే అతిపెద్ద రాష్ట్రం, అత్యధికంగా 80 సీట్లను కలిగి ఉన్న యూపీలో ఈసారి కూడా బీజేపీ హవా వీయనుంది. 74 స్థానాలను ఆ పార్టీ సారథ్యంలోని ఎన్‌డీఏ కైవసం చేసుకుంటుంది. ఎస్పీ-కాంగ్రెస్‌లకు ఆరుకు మించి లభించే అవకాశాల్లేవు. బిహార్‌లో మొత్తం 40 స్థానాలకుగాను ఎన్‌డీఏ కూటమి 32 స్థానాల్లో విజయకేతనం ఎగురవేసే అవకాశం ఉంది. మిగిలిన ఎనిమిది సీట్లకే ఇండియా కూటమి పరిమితం కావచ్చు. పంజాబ్‌లో మొత్తం 13 స్థానాలు ఉండగా, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఆమ్‌ఆద్మీ పార్టీ ఆరు స్థానాలను గెల్చుకునే అవకాశాలున్నాయి. కాంగ్రెస్ 5, బీజేపీ, అకాలీదళ్ చెరో స్థానాన్ని ఖాతాలో వేసుకోవచ్చు. 14 సీట్లున్న జార్ఖండ్‌లో 12 ఎన్‌డీఏ కూటమికి, రెండు ఇండియా కూటమికి లభించవచ్చు. దేశ రాజధాని ఢిల్లీలో మొత్తం ఏడు సీట్లనూ బీజేపీ మరోసారి హస్తగతం చేసుకోనుంది. హరియాణాలో 10 స్థానాలకుగాను బీజేపీ 8, కాంగ్రెస్ 2 స్థానాల్లో విజయం సాధించే అవకాశాలున్నాయి. గుజరాత్ (26), రాజస్థాన్ (25), హిమాచల్ ప్రదేశ్ (4)లను బీజేపీ పూర్తిగా క్లీన్‌స్వీప్ చేయనుంది. ఇక ఈశాన్య రాష్ట్రాల్లో ఉన్న 11 స్థానాల్లో 9 బీజేపీ ఖాతాలోనే పడతాయని ఏబీపీ సీ ఓటర్ సర్వే అంచనా వేసింది. కాగా, నెట్‌వర్క్ 18.. 'మెగా ఒపీనియన్ పోల్' పేరుతో తెలంగాణలో తమ సర్వే వివరాలను గురువారం వెల్లడించింది. ఈ సర్వే ప్రకారం.. రాష్ట్రంలోని 17 సీట్లలో బీజేపీ 8 కైవసం చేసుకుంటుంది. కాంగ్రెస్ 6, బీఆర్ఎస్ 2, ఎంఐఎం ఒక స్థానంలో గెలిచే అవకాశాలున్నాయి. అయితే, ఓట్ల పరంగా కాంగ్రెస్ అత్యధికంగా 34 శాతం ఓట్లను దక్కించుకుంటుందని, బీజేపీకి 28 శాతం, బీఆర్ఎస్‌కు 27 శాతం, ఇతరులకు 11 శాతం ఓట్లు లభిస్తాయని ఈ సర్వే పేర్కొంది.


మల్కాజిగిరిలో రాగిడి లక్ష్మారెడ్డి

ఆదిలాబాద్‌లో ఆత్రం సక్కు.. మరో రెండు ఎంపీ స్థానాలకు బీఆర్ఎస్ అభ్యర్థులను ఖరారు చేసిన కేసీఆర్

హైదరాబాద్, ఆదిలాబాద్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బరిలోకి దిగనున్న మరో ఇద్దరు బీఆర్ఎస్ అభ్యర్థులను ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ గురువారం ప్రకటించారు. మల్కాజిగిరి ఎంపీ స్థానానికి రాగిడి లక్ష్మారెడ్డి, ఆదిలాబాద్ స్థానానికి ఆత్రం సక్కు అభ్యర్థిత్వాలను ఆయన ఖరారు చేశారు. ఇప్పటికే ప్రకటించిన వాటితో కలిపి ఇప్పటి వరకు 11లోక్‌సభ స్థానాలకు బీఆర్ఎస్ తమ అభ్యర్థులను ప్రకటించింది. ఉప్పల్ టికెట్ రాకపోవడంతో రాగిడి లక్ష్మారెడ్డి అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరిన విషయం తెలిసిందే. అయితే మల్కాజిగిరి స్థానం నుంచి పలువురి పేర్లు ప్రచారంలో ఉన్నప్పటికీ అనూహ్యంగా రాగిడి లక్ష్మారెడ్డి అభ్యర్థిత్వాన్ని ప్రకటించడంపై పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించిన నేతలతో నందినగర్‌లోని తన నివాసంలో కేసీఆర్ గురువారం భేటీ అయ్యారు. ఆదిలాబాద్‌లో



రాగిడి లక్ష్మారెడ్డి



ఆత్రంసక్కు

పార్టీ అభ్యర్థి ఎవరన్నదానిపై నేతలతో కేసీఆర్ సుదీర్ఘంగా చర్చించారు. ఈ క్రమంలో ఆదివాసీ ఉద్యమనేత, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు టికెట్ ఇవ్వాలని నిర్ణయించారు. సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న ఆయనకు ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో అవకాశం ఇవ్వలేదు. అదేసమయంలో ఆయనకు లోక్‌సభకు అవకాశం ఇస్తామన్న అధినాయకత్వం హామీ మేరకు తాజాగా ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రకటించినట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి గెలుపొందిన ఆత్రంసక్కు ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. అప్పటి నుంచి బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారు. ఇప్పటికే బీజేపీ పార్టీ ఆదివాసీ నేతను అభ్యర్థిగా ఖరారు చేయడం, కాంగ్రెస్‌పార్టీ ఆదివాసీ నేతను బరిలోకి దించేందుకు అవకాశం ఉండడంతో బీఆర్ఎస్ కూడా ఆదివాసీనేతకు అవకాశం కల్పించింది. పొత్తుల్లో భాగంగా ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బీఎస్పీ పార్టీ అభ్యర్థి, జడ్పీ మాజీ చైర్మన్ సిడాంగణపతికి అవకాశం దక్కుతుందన్న ప్రచారం జరిగింది. కానీ ఆదిలాబాద్ జిల్లా బీఆర్ఎస్ నేతలంతా ఆత్రంసక్కు వైపే మొగ్గు చూపడంతో ఆయన అభ్యర్థిత్వాన్ని పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. కాగా గత లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పోటీ చేసి ఓటమిపాలైన నగేశ్.. తనకు ఈసారి టికెట్ దక్కదని భావించి పార్టీని వీడి బీజేపీలో చేరారు. ఆయనకు ఆదిలాబాద్ టికెట్ ప్రకటించారు.

తొర్రూరు ఆర్టీసీ డిపో మేనేజర్‌గా పద్మావతి

తొర్రూరు, మార్చి14 : తొర్రూరు ఆర్టీసీ డిపో మేనేజర్‌గా వి.పద్మావతి గురువారం బాధ్యతలను చేపట్టారు. ఆర్టీసీ బస్ భవన్‌లో ఎంఎఫ్ క్యాడర్‌లో విధులు నిర్వహిస్తున్న పద్మావతి ప్రమోషన్‌పై డిపో మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న విశ్వనాథ్ ఆసిఫాబాద్ డిపో మేనేజర్‌గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ డిపో అభివృద్ధికి కార్మికుల సహకారంతో అన్ని విధాలుగా కృషి చేస్తామని వివరించారు. నూతనంగా బాధ్యతలను చేపట్టిన మేనేజర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గత మేనేజర్ విశ్వనాథ్, ఎస్టీఐ రజిత, ఎంఎఫ్ విజయ్‌కుమార్, రవీందర్, ఎంకే. రావు, కేవీ.రెడ్డి, ఆర్.ఎస్ కుమార్, జెవై గిరి, వెంకట్‌రెడ్డి, యాకూబ్ రెడ్డి, మల్లయ్య, సూపరింటెండెంట్ శ్రీనివాస్, కార్మికసంఘాల నాయకులు ఉన్నారు.

రూ.2.50లక్షల గంజాయి పట్టివేత

● ఇద్దరు నిందితుల అరెస్ట్

మరిపెడ, మార్చి14 : రూ.2.50 లక్షల గంజాయిని పట్టుకొని, అందుకు కారకులైన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ హతిరాం తెలిపారు. మరిపెడ పీఎస్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, వివరాలను వెల్లడించారు. వీరారం రెవెన్యూ పరిధి దుబ్బాతండాకు చెందిన బానోత్ భావుసింగ్ ఖమ్మం పట్టణం ముస్తాఫానగర్‌కు చెందిన బత్తుల ఉపేందర్ ఆటోలో 10.50 కిలోల శుద్ధి చేసిన గంజాయిని అమ్మకం కోసం తరలిస్తున్నారు. నమ్మదగిన సమాచారంతో మరిపెడ ఎస్సై తహెర్ తన సిబ్బందితో బుధవారం రాత్రి పెట్రోలింగ్‌లో భాగంగా మరిపెడ రాజీవ్‌గాంధీ చౌరస్తా దగ్గర తనిఖీ చేస్తుండగా ఆ ఇద్దరు నిందితులు పట్టుబడ్డారు. గంజాయిని సీజ్‌చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఎస్సై తహెర్, సీరోలు ఎస్సై విజయ్‌రామ్‌కుమార్, మరిపెడ పోలీస్ సిబ్బందిని తొర్రూరు డీఎస్పీ సురేశ్ అభినందించారు.

హామీలను వెంటనే నెరవేర్చాలి

మహబూబాబాద్ రూరల్, మార్చి14 : కేంద్రప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అఖిల భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి గౌని ఐలయ్య డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన మూడు నల్లచట్టాలను వెనక్కి తీసుకోవాలని ఢిల్లీలో రైతులు ధర్నా చేయడంతో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి ఆ చట్టాలను వెనక్కి తీసుకుంటామని నేటికి రెండేళ్లు గడిచిన ఆ చట్టాలను రద్దు చేయలేదని చెప్పారు. ఇప్పటికైనా వాటిని రద్దుచేసి, రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నందగిరి వెంకటేశ్వర్లు, నల్లపు సుధాకర్, గుజ్జు దేవేందర్, పుమ్మయ్య, జి.సక్రు, గునిగంటి రాజన్న, ఎస్‌కె. తాజ్‌పాషా, బాబన్న, కోటయ్య పాల్గొన్నారు.

మానుకోట అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి

● ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, మార్చి 14 : మానుకోట పట్టణాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ 22వ వార్డులోని కొండపల్లి గోపాల్‌రావునగర్ (కేజీఎన్) కాలనీలో రూ.10లక్షలతో చేపట్టిన మినిపార్కు, కంకరబోడులో రూ.49 లక్షలతో హిందూ శ్మశాన వాటికలో చేపట్టిన అభివృద్ధి పనులను గురువారం ప్రారంభోత్సవం చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయంలో అన్నివర్గాలకు సముచిత స్థానం దక్కుతుందని చెప్పారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా కాంగ్రెస్ సర్కార్ అమలు చేస్తూ వస్తుందని వివరించారు. ఎమ్మెల్యేగా తనను గెలిపించి అసెంబ్లీకి పంపిన ప్రజలకు ఎల్లప్పుడు రుణపడి ఉంటానని, వారి అభ్యున్నతే ధ్యేయంగా పని చేస్తానని స్పష్టం చేశారు. ఆయా కార్యక్రమాల్లో చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, కమిషనర్ నోముల రవీందర్, డీఈ ఉపేందర్, స్థానిక కౌన్సిలర్, సీపీఐ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథి రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, కౌన్సిలర్లు సలీం, పోతురాజు రాజు, ఘనపురపు అంజయ్య, ఎడ్ల రమేష్, కోడి శ్రీను, పెరుగుకుమార్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎం.వెంకట్‌రెడ్డి, అనుమాల వెంకటేశ్వర్లు, వైద్యులు జగన్మోహన్‌రావు, అర్జున్‌రెడ్డి, కె.చంద్రశేఖర్, ఇంద్రసేనారెడ్డి, ఆర్. వెంకట్‌రెడ్డి, పరమాత్మాచారి, డోలి సాయికిరణ్, ఏకాంబ్రం, కాశీనాథ్, లక్ష్మీనారాయణ, సురేష్, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ డాక్టర్ నాగవాణి పాల్గొన్నారు.



కంకరబోడులో హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేస్తున్న మురళీనాయక్

మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌రావు అంత్యక్రియలు పూర్తి

పెద్దవంగర, మార్చి 14 : మాజీ ఎమ్మెల్యే డాక్టర్ నెమురుగొమ్ముల సుధాకర్‌రావు అంత్యక్రియలు గురువారం సాయంత్రం ఆయన స్వగ్రామమైన మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం వడ్డెకొత్తపల్లిలో పూర్తయ్యాయి. కిడ్నీ సంబంధ వ్యాధితో హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఉండగా.. గుండెపోటుకు గురై ఆయన బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. దీంతో గురువారం ఉదయం కుటుంబసభ్యులు ఆయన పార్థీవదేహాన్ని వడ్డెకొత్తపల్లి గ్రామానికి తీసుకువచ్చారు. ప్రజల సందర్శనార్థం భౌతికకాయాన్ని నివాసంలో ఉంచగా.. ఆయన్ను కడసారి చూసేందుకు అభిమానులు భారీగా తరలొచ్చారు. పలువురు పార్టీల నాయకులు, బంధువులు, మిత్రులు సుధాకర్‌రావు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుధాకర్‌రావు మృతితో పాలకుర్తి నియోజకవర్గం ప్రజలు విషాదంలో మునిగిపోయారు. మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, పొన్నాల లక్ష్మయ్య, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రామచంద్రునాయక్, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన సతీమణి వినయరాణి, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని, మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్సీ తక్కళ్లపెల్లి రవీందర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, శంకర్‌నాయక్, శ్రీరాంభద్రయ్య, పెద్ది సుదర్శన్‌రెడ్డి, ధర్మరావు, రాజేశ్వర్‌రావు, మానుకోట మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామోహ్మన్‌రెడ్డి, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, గూడిపుడి నవీన్‌రావు, సంకినేని వెంకటేశ్వర్లు, దశమంత్ రెడ్డి, దుగ్యాల హరీష్‌రావు, రామచంద్రయ్య, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సుధాకర్‌రావు మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రావు నియోజకవర్గ అభివృద్ధి కోసం చేసిన కృషిని, సేవలను, ఆయనతో వారికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రముఖ వైద్యుడిగా, పాత చెన్నూరు (ప్రస్తుత పాలకుర్తి) ఎమ్మెల్యేగా అందించిన సేవలు మరువలేనివన్నారు.

ఇక సాయంత్రం జరిగిన అంత్యక్రియల్లో మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రామచంద్రునాయక్ పాల్గొని పాడె మోశారు.



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి హరీష్‌రావు, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



సుధాకర్‌రావు పాడె మోస్తున్న ప్రభుత్వవిప్ రామచంద్రునాయక్, మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

'ఎంపీగా సీతారాంనాయక్‌ను గెలిపించాలి'

మరిపెడ, మార్చి14 : భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఎంపీ అభ్యర్థిగా తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్‌ను మహబూబాబాద్ పార్లమెంట్ ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా సీనియర్ నేత గాదె రాంబాబు ప్రజలకు పిలుపునిచ్చారు. మరిపెడ విశ్రాంతి భవన్‌లో గురువారం ఆయన ఆపార్టీ స్థానిక నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు బింగి రమేశ్, కట్టోజ్ గంగాధర్, సుధాకర్, వెంకన్న, హుస్సేన్ పాల్గొన్నారు.

అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి

మరిపెడ, మార్చి14 : రెవెన్యూ, పోలీస్, ఎన్నికల విధులలో పాల్గొనే అన్నిశాఖల అధికారులు పార్లమెంట్ ఎన్నికలు పూర్తయ్యేలోపు అప్రమత్తంగా ఉండాలని తొర్రూరు ఆర్డీవో నర్సింహారావు, డీఎస్పీ సురేశ్ అన్నారు. తహసీల్ ఆఫీస్‌లో గురువారం డోర్నకల్ నియోజకవర్గానికి సంబంధించిన రెవెన్యూ పోలీస్, ఇతరశాఖల అధికారులతో వారు సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ రూట్ల ఏర్పాటుపై సమీక్షించారు. పోలింగ్ నిర్వహణ, పోలింగ్ కేంద్రాల్లోని సౌకర్యాలపై చర్చించారు. కోడ్ అమల్లోకి వచ్చాక అన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల తహసీల్దార్లు, మరిపెడ, డోర్నకల్, తొర్రూరు సీఐలు, అన్ని పీఎస్‌ల నుంచి ఎస్సైలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలు పరిష్కరించాలి

● కొత్తపల్లి రవి

తొర్రూరు, మార్చి14 : దేశ వ్యాప్తంగా ఉన్న వేలాది మంది కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. ప్రపంచ దేశాల్లో శ్రమచేసిన కార్మిక వర్గాల సమస్యల కోసం పోరాడిననేత కారల్‌మార్క్స్ చిత్రపటానికి గురువారం నివాళి అర్పించి, మాట్లాడారు. దేశంలో కోట్లాది మంది కార్మికులు రెక్కలు ముక్కలు చేసుకుని చెమట చిందిస్తుంటే కార్మికుల శ్రమకు తగ్గట్టు ఆదాయాలు పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక విధానాలు అంబానీ, ఆదానీ లాంటి కార్పొరేట్ సంస్థలకు ఆదాయాన్ని రెట్టింపు చేస్తూ దేశంలో 80 కోట్ల మంది పేదలకు బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. పేదరిక నిర్మూలన, ఉద్యోగావకాశాలు కల్పించి రైతు పండించిన పంటలకు గిట్టు బాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరన్న, నవీన్, లక్ష్మయ్య, రాములు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మండలంలో సీసీ రోడ్లకు శంకుస్థాపన

బయ్యారం, మార్చి 14 : మండలంలోని పలు అంతర్గత సీసీ రహదారులకు ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య గురువారం శంకుస్థాపనలు చేశారు. సుమారు ఒక కోటి ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో మండంలోని ఇసుకమెది, మిర్యాలపెంట, వెంకటాపురం, కంబాలపల్లి, అల్లిగూడెం, జగత్‌రావుపేట, రామచంద్రాపురం, మొట్లతిమ్మాపురం, వెంకట్రాంపురం, గురిమెళ్ల, కోటగడ్డ, సింగారం, నామాలపాడు, కాచనపల్లి, కోయగూడెం, జగత్‌రావుపేట, బయ్యారం గ్రామాలలో చేపడుతున్న సీసీ రహదారులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మాజీ కేంద్ర మంత్రి, మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరామ్ నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కంబాల ముసలయ్య, నాయకులు సోమేష్, శ్రీనివాస్ రెడ్డి, వీరారెడ్డి, వెంకటేశ్వర్లు, రాము నాయక్, రాంమూర్తి, రవి నాయక్, కేతమల్లు, ప్రవీణ్ నాయక్, లక్ష్మణ్‌రావు, వెంకన్న, నాగేశ్వరరావు, మోహన్‌జీ, మంగీలాల్, రమేష్, రాకేష్, భాస్కర్, సుభద్ర పాల్గొన్నారు.

బుకింగ్ కౌంటర్‌లో చిల్లర ఇవ్వడం లేదని ట్విట్టర్‌లో ఫిర్యాదు

డోర్నకల్, మార్చి 14 : డోర్నకల్ రైల్వేజంక్షన్‌లోని రైల్వే టికెట్ బుకింగ్ కౌంటర్‌లో ప్రయాణికులకు చిల్లర ఇవ్వడం లేదని ఆరోపిస్తూ పట్టణానికి చెందిన కుందోజు లవన్‌కుమార్ రైల్వే అధికారులకు ట్విట్టర్ ద్వారా ఫిర్యాదు చేశారు. రూ.45ల టికెట్ కోసం రూ.50 నోట్ ఇస్తే చిల్లర రూ.5 లేదంటూ టికెట్ కౌంటర్ సిబ్బంది నొక్కేస్తున్నారని తెలిపారు. కొందరు ప్రయాణికులు చేసిన ఫిర్యాదును ట్విట్టర్‌లో రైల్వే అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రైల్వే అధికారులు స్పందించి భవిష్యత్‌లో అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ట్విట్టర్ ద్వారా రైల్వే అధికారులు హామీ ఇచ్చినట్లు లవన్‌కుమార్ తెలిపారు. దీంతో రైల్వే అధికారులకు లవన్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా బండ్లు తిరిగే కార్యక్రమం

కురవి, మార్చి 14 : శ్రీవీరభద్రస్వామి మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం బండ్లు తిరిగే కార్యక్రమం ఘనంగా జరిగింది. రైతులు, గిరిజనులు ఎండ్ల బండ్లపై ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. నేరడ గ్రామం నుంచి రజకులు తీసుకువచ్చిన ప్రబబండి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నేరడ ప్రబబండిని తీసుకువచ్చిన రజకులకు ఆలయ ఈవో సత్యనారాయణ, చైర్మన్ రవీందర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బిక్షమయ్య, రుద్రారపు యాలాద్రి, సోమయ్య, శ్రీనివాస్, వీరేందర్, వినయ్, వెంకటాచలం, ప్రసాద్, వెంకన్న, శంకర్, యాకయ్య పాల్గొన్నారు.

● శ్రీవీరభద్రస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా 8వ రోజు వీరభద్రస్వామి వేటకు వెళ్లే కార్యక్రమాన్ని ఆలయ పూజారులుభక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

●అంకురార్పణతో ప్రారంభమైన వీరభద్రుడి కల్యాణ మహోత్సవాలు బుధవారం రాత్రి జరిగిన స్వామివారి రథోత్సవ ఊరేగింపు కార్యక్రమంతో ఏడు రోజుల పాటు జరిగిన సప్తానికోత్సవ పూజా కార్యక్రమం పూర్తయింది.

● మానుకోట ఎంపీ అభ్యర్థుల ప్రొఫైల్స్

కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్..



పేరు	: పోరిక బలరాంనాయక్
పార్టీ	: కాంగ్రెస్
పదవి	: కేంద్ర మాజీమంత్రి, (మహబూబాబాద్ మాజీ ఎంపీ)
విద్యార్హత	: ఎంఏ
పుట్టిన తేదీ	: 06-06-1964
భార్య	: తిరుపతమ్మ
పిల్లలు	: సాయిశంకర్, సాయికిరణ్
తల్లిదండ్రులు	: పోరిక లచ్చునాయక్-లక్ష్మీబాయి
స్వగ్రామం	: మదనపల్లి (ములుగు మండలం)

పరిచయం : బలరాంనాయక్ హైదరాబాద్ ఏపీఎస్పీ పోలీస్ ఉద్యోగంలో పని చేశారు. ఆ తర్వాత సెక్రటియేట్ టెలికాం ఉద్యోగిగా చేరారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులతో పరిచయాల క్రమంలో లాబీయింగ్ నడిపారు. మరోపక్క ఆలిండియా బంజార సేవక్‌సమాజ్ జాతీయ అధ్యక్షుడిగా పని చేశారు. 2009లో నియోజకవర్గాల పునర్వీభజనతో ఆవిర్భవించిన మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ నుంచి పోటీచేసి గెలిచి కేంద్రసహాయ మంత్రి పదవిని అధిష్టించారు. 2014, 2019పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనూ మహబూబాబాద్ నుంచి కాంగ్రెస్ తరుపున పోటీ చేసి ఓటమిపాలయ్యారు.

బీజేపీ అభ్యర్థి సీతారాంనాయక్..



పేరు	: అజ్మీర సీతారాంనాయక్
పార్టీ	: బీజేపీ
పదవి	: మాజీ ఎంపీ
విద్యార్హత	: పీహెచ్‌డీ (డాక్టరేట్)
పుట్టిన తేదీ	: 20 ఆగస్టు 1957
భార్య	: శారద
పిల్లలు	: కుమార్తె పల్లవి (బయోటెక్నాలజీ), కుమారులు డాక్టర్ రాకేష్ (ఎంఎస్ ఆర్థో), రాజేష్ (ఇంజనీర్)
తల్లిదండ్రులు	: మంగమ్మ-లక్ష్మణ్
స్వగ్రామం	: మల్లేపల్లి, వెంకటాపూర్ మండలం, ములుగు జిల్లా.

పరిచయం : కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో జేఏసీలో పనిచేశారు. 2014లో టీఆర్ఎస్ తరుపున మహబూబాబాద్ ఎంపీగా గెలుపొంది. 2019 వరకు పనిచేశారు. ఈనెల 10న ఢిల్లీలో బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ తరుణ్‌చుగ్ సమక్షంలో భారతీయ జనతా పార్టీలో చేరారు.

బీఆర్ఎస్ అభ్యర్థి కవిత..



పేరు	: మాలోతు కవిత
పార్టీ	: టీఆర్ఎస్
పదవి	: పార్లమెంట్ సభ్యురాలు, జిల్లాపార్టీ అధ్యక్షురాలు
విద్యార్హత	: బీఎస్సీ కంప్యూటర్స్
పుట్టిన తేదీ	: 31-12-1979
వివాహం	: 2001
భర్త	: భద్రునాయక్ ఇండియన్ టెలికమ్యూనికేషన్స్ చేసి ప్రస్తుతం తెలంగాణ స్టేట్ షుగర్ అండ్ కేన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ పదవిలో ఉన్నారు.
పిల్లలు	: మహతి మాలోత్, నయన్ మాలోత్
తల్లిదండ్రులు	: డీఎస్.రెడ్యానాయక్-లక్ష్మి
జన్మస్థలం	: ఉగ్గంపల్లి (మరిపెడ మండలం)
అత్తగారు	: సీతంపేట (గార్ల మండలం)

పరిచయం : 2009లో తండ్రి, మాజీమంత్రి, ప్రస్తుత డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ రాజకీయ వారసురాలిగా రంగప్రవేశంతోనే మహబూబాబాద్ కాంగ్రెస్ టికెట్‌తో పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో మరోమారు పోటీ చేసి ఓడిపోయాక తండ్రి రెడ్యానాయక్‌తో కలిసి టీఆర్ఎస్‌లో చేరారు. ప్రస్తుతం రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతునే స్టేషన్ ఘన్‌పూర్, వర్ధన్నపేట, జనగామ అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జీగా ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో డోర్నకల్, మహబూబాబాద్ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్, బానోత్ శంకర్‌నాయక్‌ల విజయానికి పాటుపడ్డారు. అంతకు ముందు హైదరాబాద్ జీహెచ్ఎంసీ, వరంగల్ కార్పొరేషన్ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థుల తరుపున ప్రచారం చేశారు. పాలేరు ఉప ఎన్నికల్లోనూ కవిత ప్రచారంలో పాల్గొన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో టీఆర్ఎస్ టికెట్‌తో మహబూబాబాద్ నుంచి పోటీచేసి భారీ మెజార్టీతో గెలుపొందారు.

వ్యక్తిపై దాడి : ఇద్దరిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్, మార్చి14 : భూ తగాదాల్లో వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ గురువారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్‌లోని ట్వింకిల్‌స్టార్ స్కూల్ వెనుక సర్వే నెంబర్ 599లో 250 చదరపుగజాల స్థలంను 2006లో దేశబోయిన రాంమ్మూర్తి వద్ద ఈదులపూసపల్లికి చెందిన కుండె బీరయ్య కొనుగోలు చేసినట్లు చెప్పారు. గురువారం ఉదయం 11 గంటల సమయంలో కుండె బీరయ్యతో పాటు మరో 15 మంది ప్లాట్ వద్దకు వెళ్లగా బత్తుల కృష్ణ, ముఖేష్ అనే ఇరువురు వ్యక్తులు వారి వద్దకు వచ్చి దుర్భాషలాడుతూ... కుండె బీరయ్యపై బత్తుల కృష్ణ సెంట్రింగ్ కర్రతో తలపై కొట్టాడు. ఈ ఘటనలో కుండె బీరయ్య తలకు తీవ్రగాయామైంది. వెంటనే కుండె బీరయ్య వెంట వచ్చినవారు డయల్ 100కు ఫోన్ చేశారు. ఘటన స్థలానికి వచ్చిన పోలీసులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. తన కుమారుడిపై దాడి చేసిన ఇరువురిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీరయ్య తల్లి కొమురమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కురవి పోలీస్‌స్టేషన్ ఎదుట పురుగులమందు తాగిన నిందితుడు

కురవి, మార్చి 14 : తాట్యాతండా గ్రామపంచాయతీ శివారు పిల్లగుండ్లతండాకు చెందిన గుగులోత్ రమేష్ కురవి పోలీస్‌స్టేషన్ ఎదుట పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనం సంబంధించి ప్రత్యక్షసాక్షుల కథనం ప్రకారం. రమేష్‌పై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా బాపట్లలో ఛీటింగ్ కేసు గతంలో ఉంది. ఈ విషయమై ఆ రాష్ట్ర పోలీసులు రమేష్‌ను అరెస్ట్ చేసేందుకు కురవికి వచ్చారు. వారెంట్ చూపించి రమేష్‌ను తీసుకువెళ్తున్న సమయంలో ఆయన పురుగుల మందు తాగేందుకు యత్నించాడు. రమేష్‌ను మహబుబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయిస్తున్నారు. అతడికి ప్రాణ అపాయం ఏమి లేదు. ఈ విషయమై ఎస్సై గోపిని వివరాలు అడిగేందుకు యత్నించగా, అందుబాటులో లేరు.

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిగా హుస్సేన్‌నాయక్ ప్రమాణస్వీకారం

మహబూబాబాద్ రూరల్, మార్చి 14 : ఢిల్లీలోని జాతీయ ఎస్టీ కమిషన్ కార్యాలయంలో కమిషన్ సభ్యుడిగా జాటోతు హుస్సేన్‌నాయక్ గురువారం ప్రమాణస్వీకారం చేశారు. ఈపదవిలో హుస్సేన్‌నాయక్ రెండేళ్లు కొనసాగనున్నారు. ప్రమాణస్వీకారం అనంతరం జాటోతు హుస్సేన్‌నాయక్‌కు మానుకోట పార్లమెంట్ అభ్యర్థిగా ఎంపికైన అజ్మీర సీతారాంనాయక్, వల్లభు వెంకటేశ్వర్లు, చీకటి మహేష్‌గౌడ్, సింగారపు సతీష్, భైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సిదాంధర్థరెడ్డిలు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

'ఓటు హక్కును వినియోగించుకోవాలి'

మహబూబాబాద్ రూరల్, మార్చి 14 : త్వరలో జరుగున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ప్రశాంతతమైన వాతవరణంలో తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య అన్నారు. మహబూబాబాద్ మండలం సింగారంలో గురువారం ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎవరైన ఎన్నికల సమయంలో అల్లర్లు సృష్టిస్తే ఎంతటివారైన ఊపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై దీపికరెడ్డి, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

దడువాయి సంఘం అధ్యక్షుడు మంగీలాల్



కేసముద్రం, మార్చి 14 : కేసముద్రం వ్యవసాయ మార్కెట్ దడువాయి సంఘం నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షునిగా ఆంగోత్ మంగీలాల్, ఉపాధ్యక్షులుగా కొడారి నాగేంద్రబాబు, ప్రధాన కార్యదర్శిగా సింగిరెడ్డి కృష్ణ, సహాయ కార్యదర్శిగా బట్టు సుధాకర్, కోశాధికారిగా బేతి రాజు, సహాయ కోశాధికారిగా సింగిరెడ్డి వెంకట్‌రెడ్డిలను ఎన్నుకున్నారు.

ఇళ్ల స్థలాల లబ్ధిదారుల ధర్నా

కేసముద్రం, మార్చి 14 : తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం కేసముద్రంస్టేషన్, విలేజి, భూక్యరాంతండాకు చెందిన పలువురు ఇళ్ల స్థలాల లబ్ధిదారులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నాలో పాల్గొన్న వాంకుడోత్ వెంకన్న మాట్లాడారు. గత ప్రభుత్వంలో దశాబ్ధి ఉత్సవాల్లో 45 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చారని, తమకు ప్లాటు సైతం కేటాయించారని తెలిపారు. సదరు స్థలంలో ఇంటి నిర్మాణం చేయబోతేంటే అధికార పార్టీ నాయకుల ప్రోద్భలంతో అధికారులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా తాము ఇంటి నిర్మాణం చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లకావత్ నరేష్, భూక్య రమేష్, ఎండి.సోని, జాటోత్ వెంకన్న, చిన్న, శాంతి, మంచన ప్రసాద్, శివ, బోడ విజేందర్, యాకూబ్, వాల్యా, ప్రహసిత్, జాటోత్ బద్రి, విజయ, కవిత పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకను గెలిపించాలి : ఎంపీ

నర్సింహులపేట, మార్చి 14 : పార్లమెంట్ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుకను గెలిపిస్తేనే ప్రజా సమస్యలపై పోరాటం సాగుతుందని మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత ఉన్నారు. నర్సింహులపేట మండల కేంద్రంలో గురువారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మైదం దేవేందర్ అధ్యక్షతన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు ఎల్లు మధుసూదన్‌రెడ్డి, సువీర్‌రెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, జాటోతు దేవేందర్ నాయక్, ఎంపీటీసీలు మాజీ సర్పంచ్‌లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

పీడిత మానవాళి విముక్తి ప్రదాత కారల్‌మార్క్స్

మహబూబాబాద్ రూరల్, మార్చి 14 : ప్రపంచ వ్యాప్తంగా శ్రమజీవులకు విముక్తి సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన మహోన్నత వ్యక్తి కారల్‌మార్క్స్ అని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. మహబూబాబాద్ ఆపార్టీ కార్యాలయంలో కారల్‌మార్క్స్ 141వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటం వద్ద నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ కోట్లాది మంది శ్రమజీవులు తమ రెక్కల కష్టాన్ని నమ్ముకుని జీవిస్తుంటే వారిని దోచుకునే శ్రమదోపిడీ దారులపై పోరాటానికి మార్క్సిజం అనేమహోత్తర సిద్ధాంతాన్ని అందించారని చెప్పారు. ముంజంపల్లి వీరన్న, బిల్లకంటి సూర్యం, బండపల్లి వెంకటేశ్వర్లు, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాన్షీరాం జయంతిని జయప్రదం చేయండి

మహబూబాబాద్ టౌన్, మార్చి14 : పడిత ప్రజల విముక్తి కోసం తన తుదిశ్వాస విడిచేంత వరకు పాటుపడిన మహనీయులు కాన్షీరాం జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ధర్మసమాజ్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు సురుగు శ్రీకాంత్ పిలుపునిచ్చారు. ఈనెల 15 నుంచి ఏప్రిల్ 30 వరకు ఉత్సవాలను జరుపుతున్నట్లు తెలిపారు. మహబూబాబాద్‌లో ధర్మసమాజ్ పార్టీ వార్షికోత్సవ ప్లీనరీ కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ ధర్మసమాజ్ పార్టీ స్థాపించిన మార్చి 15న గ్రామగ్రామాన వార్షికోత్సవ ప్లీనరీలను జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ వ్యవస్థాపకుడు విశారదన్‌మహారాజ్‌పై బీఎస్పీ నేత ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణలు చెప్పాలన్నారు. రాంపాక సుధాకర్, కొమ్ము రామకృష్ణ, దాసరి లక్ష్మీనివాస్, శ్రీరాం పాల్గొన్నారు.

'యువత ప్రజాస్వామ్య లక్షణాలు పెంపొందించుకోవాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 14 : యువత ప్రజాస్వామ్య లక్షణాలు పెంపొందించుకోవాలని వరంగల్ నిట్ ప్రొఫెసర్ రవికుమార్ అన్నారు. మహబూబాబాద్ నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నెహ్రూ యువకేంద్రం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో ప్రభుత్వ, నలంద డిగ్రీ కళాశాలల విద్యార్థులకు నైబర్‌హుడ్ యూత్ పార్లమెంటు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్య క్రమానికి రిసోర్స్ పర్సన్‌గా హాజరైన ఆయన మాట్లాడారు. యువత విద్యార్థి దశనుంచే లక్ష్యాన్ని ఎంచు కొని లక్ష్యసాధనకు పట్టుదల, క్రమశిక్షణ కృషి చేయాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం అని, 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటుహక్కు నమోదు చేసుకొని, ఎన్నికల్లో హక్కును వినియోగించుకోవాలన్నారు. డీఆర్డీవో పురుషోత్తం మాట్లాడుతూ స్వీప్ సూచనలను గుర్తుంచుకొని ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వశాఖ అధికారి శ్రీధర్ సూరునేని మాట్లాడుతూ మొదటి సారిగా ఓటుహక్కు పొందిన యువత రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో సమర్థులైన నేతలను ఎన్నుకునేందుకు ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. నెహ్రూ యువకేంద్రం అధికారి అన్వేష్ మాట్లాడుతూ మైభారత్ పోర్టల్ ద్వారా విద్యార్థులు తమ వివరాలు నమోదు చేసుకొని, కేంద్రప్రభుత్వ పథకాల గురించి తక్షణమే సమాచారం పొందాలన్నారు. తొలుత స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. డాక్టర్ గోపికారాణి, సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ నాగవాణి, ప్రిన్సిపాల్ రాజు, నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, బాలగాని అనిల్‌కుమార్, రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.